


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 23 పుష్పం : 56-57 20-8-2003

**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 23

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-07-2003, ముక్కామల

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎప్పుడు ఎక్కడ ఏది ఎలా జరగాలో అప్పుడు అక్కడ అది అలా జరుగుతూఉంటుంది. అది ఈశ్వరనిర్ణయం. అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే. గోదావరి పుష్కరాల ప్రారంభసమయంలో ముక్కామల గ్రామంలో శ్రీధర్ స్వామీజీ ఆశ్రమంలో జరిగే కార్యక్రమంలో మనం ప్రవచనం ఏర్పాటుచేసుకొన్నాము. వాసవీ కన్యకామాత అగ్నిప్రవేశం చేసిన ప్రదేశం ఇది అని, బ్రహ్మదేవుడు ఇక్కడ యజ్ఞంచేసాడు అని, సుబ్రహ్మణ్యుడు ఇక్కడ తపస్సు చేసాడు అని ముక్కామలక్షేత్రం యొక్క ప్రాముఖ్యత గురించి స్వామీజీ చెప్పారు. ఈక్షేత్రం అభివృద్ధికి స్వామీజీ కృషి చేస్తున్నారు. ఈరోజు మనం ఇక్కడ పుష్కరస్నానం చేసాము. పుష్కరుడు అనేవాడు మహాజ్ఞాని, బ్రహ్మదేవుని కమండలంలో ఉండేవాడు. ఆయనకు జలరూపంలో ఉండేశక్తిని బ్రహ్మదేవుడు ప్రసాదించాడు, పుష్కరుడు మనలను పవిత్రంచేస్తాడు. ఆపుష్కరుడిని ఇమ్మని బృహస్పతి బ్రహ్మదేవుడిని అడిగాడు. పుష్కరుడికి బ్రహ్మదేవుడిని విడిచిపెట్టి రావటం ఇష్టంలేదు. బ్రహ్మదేవుడు ఏమి చెప్పాడు అంటే ఆయనకు రావటం

ఈ సంచికలో......

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగప్రాభాషణములు**


30-7-2003 ముక్కామల ........ 1
05-8-2003 రాజమండ్రి ........ 8


Visit us @ www.srinannagaru.com



ఇష్టంలేదు, మీరు ఆయన కావాలని అంటున్నారు. అందువలన రాజీమార్గం సూచిస్తాను. ఒక సంవత్సరంలో 12 రోజులు ఆయన మీతో కలసి ఉంటాడు అని బృహస్పతితో బ్రహ్మదేవుడు చెపుతాడు. ఒకరాశిలో బృహస్పతి ప్రవేశించినప్పడు ఒకోనదికి పుష్కరం వస్తూ ఉంటుంది. మనకు ఉన్న 12నదులలో ఒకో సంవత్సరంలో ఒకోనదిలో 12 రోజులు పుష్కరుడు బృహస్పతితో కలిసిఉంటాడు. జలరూపంలో ఉండి, పవిత్రంచేసేశక్తిని పుష్కరుడికి బ్రహ్మదేవుడు ప్రసాదించాడు. అందుచేత ఆ 12 రోజులు ఆనదిలో ఎవరైతే స్నానం చేస్తారో వారు పవిత్రులవుతారు, దోషాలనుండి విముక్తి పొందుతారు. దేహాన్ని, మనస్సును శుద్ధి చేసుకోవటానికి, ఆధ్యాత్మిక వాతావరణం కలుగచేయటానికి ఈపుష్కరస్నానాలు ఏర్పాటు చేసారు. నదిలో ఎక్కడ స్నానం చేసినా ఒక్కటే. ఒకచోట చేస్తే ఎక్కువ పుణ్యం వస్తుంది. అని అనుకొంటారు కాని నదిలో ఎక్కడస్నానం చేసినా పుణ్యంఒక్కటే అందులో సందేహంలేదు. పుష్కరుడు నది అంతటా ఉంటాడు నదిపొడవునా ఉంటాడు అందుచేత మనం ఎక్కడస్నానం చేసినా ఒక్కటేపుణ్యం వస్తుంది. ఆధ్యాత్మిక వాతావరణం పెంచటానికి ఇక్కడ శ్రీధర్ స్వామిజీ కృషి చేస్తున్నారు. మనం స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే లోపలఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి మనస్సు ప్రిపేర్ అవుతుంది. మంత్రం అంటే మననం చేసేవాడిని రక్షించేది మంత్రం. ఎవరికి ఇష్టమైన మంత్రాన్ని వారు శ్రద్ధగా, ప్రేమతో జపిస్తూఉంటే జపించేవాడిని ఆమంత్రం రక్షిస్తుంది. జపధ్యానములు మనస్సును పవిత్రంచేస్తాయి, లోపలఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి మనస్సును సిద్ధం చేస్తాయి. మనశరీరం శుద్ధంగా ఉండాలి, మనస్సు శుద్ధంగా ఉండాలి, మనస్సు పవిత్రంగా ఉండాలి, ఎంతో కొంత స్వార్థం లేకుండా మనం పనిచేస్తూ ఉండాలి, సామాజికస్పృహకలిగి ఉండాలి. ఇవిఅన్నీ చేయటంవలన ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది అనికాదు, వీటివలన ఆత్మజ్ఞానసముపార్జనకు మన మనస్సు సిద్ధమవుతుంది. పుష్కరస్నానం పుణ్యం కలుగజేస్తుంది. పుణ్యం వలన లోచూపు కలుగుతుంది, జ్ఞానం సంపాదించుకోవాలి అనే కాంక్ష మనకు కలుగుతుంది. పుష్కరస్నానం చేసి నీమనస్సును పవిత్రంచేసుకొని, నీబుద్ధిని శుద్ధిచేసుకొని ఆత్మజ్ఞాన సముపార్జనకు వాటిని సమాయుక్తం చేసుకోమని పుష్కరుడి సందేశం. ఆత్మజ్ఞానం పొందటానికి కొంత పునాది ఉండాలి, ట్రైనింగ్ ఉండాలి. ట్రైనింగ్ లేకుండా ఇది వస్తుందని చాలామంది అనుకొంటున్నారు. ట్రైనింగ్ లేకుండా సబ్జక్టురాదు, సంస్కారం రాదు. ట్రైనింగ్ లేనివారు భౌతికంగా ఆధ్యాత్మికంగా నష్టపోతారు. పూజ చేయటం వలన, జపం చేయటం వలన తమోగుణం, రజోగుణం తగ్గుతాయి, సత్వగుణం పెరుగుతుంది. మన ఇష్టదేవతకు రోజూ పూజచేస్తున్నాము అనుకోండి, జపం చేస్తున్నాము

అనుకోండి టైముకుస్నానం చేస్తాము, అన్నీ టైముప్రకారము చేస్తాము దానివలన తమోగుణం, రజోగుణం తగ్గుతుంది, ప్రకృతిభావన తగ్గుతుంది, దైవభావన పెరుగుతుంది. పూజ, జపం యాంత్రికంగా చేయకూడదు, మనస్సు అక్కడపెట్టి చేయాలి. పూజ, జపం, ధ్యానం ఇంద్రియనిగ్రహానికి, మనోనిగ్రహానికి సహకరిస్తాయి. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి సత్వగుణం అవసరం. మనం ఇతరులను అనుకరించకూడదు వ్యక్తిగతమైన అభిప్రాయాలను పట్టించుకోకూడదు. ఈరోజు నాతో ఒక ప్రొపెసర్‌గారు ఇలా చెప్పారు. ఆయన పైప్రొఫెసర్‌తో మాట్లాడుతూ ఫలానావారు రోజూ మిమ్మల్ని తిడుతున్నారు అని అన్నారట. ఆయన అన్నాడట వారు ఎంత కాలంతిడతారు, అలా తిడుతూ ఉండనివ్వండి అని అన్నారట. ఇది ఎందుకు చెప్పారు అంటే ఆయనలో ఉన్న సత్వగుణం గురించి చెప్పటానికి ఈవిషయం చెప్పారు. సత్వగుణం వలన సహనం వస్తుంది., సహనం వలన మనకు మేలు జరుగుతుంది, సహనం వలన అంతర్‌దృష్టి కలుగుతుంది, పవిత్రత వస్తుంది, మనస్సు ఆత్మాకారం చెందుతుంది. అందువలన సహనాన్ని పెంచుకొంటూ రావాలి. జరిగిపోయిన గొడవలు రోజూ తలపెట్టుకోవటం వలన నెత్తిమీద బరువు మిగులుతుంది, మీకు అంతర్‌దృష్టి కలుగదు, ఆత్మజ్ఞానం కలుగదు. భూతకాలాన్ని నిరంతరం జ్ఞాపకం పెట్టుకోవటం వలన నీకు పోజిటివ్ తింకింగ్ రాదు, నెగిటివ్‌తింకింగ్ వస్తుంది. చేతిలో ఉన్న వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి, మీక్షేమంనేను కోరుకోవాలి, నాక్షేమం మీరు కోరుకోవాలి. స్నేహం అంటే పరస్పరం ఒకరిక్షేమం ఒకరు కోరుకోవాలి. ఒకరి కష్టసుఖాలలో మరియొకరు భాగం పంచుకోవాలి అది స్నేహం అంటే అంతేగాని ఒకరినాశనం మరియొకరు కోరుకోవటానికి కాదు. పరస్పరం మేలు చేసుకోవటానికే స్నేహాలు. మీరు ఇష్టమైన దేవత యొక్క నామాన్ని జపిస్తూ ఉండాలి, ఆరూపాన్ని ధ్యానం చేస్తూఉండాలి. ఎందుచేతనంటే మనం ఒక రూపానికి, నామానికి పరిమితమై ఉన్నాము కాబట్టి మనం ఏదేవత యొక్క రూపాన్ని ధ్యానిస్తున్నామో, ఏనామాన్ని జపిస్తున్నామో ఆనామరూపములు మన నామరూపముల నుండి మనలను దూరంచేస్తాయి. నది సముద్రంలో కలిసినప్పుడు తన నామరూపాలను పోగొట్టుకొంటుంది. మనం నామబుద్దిని, రూపబుద్దిని తగ్గించుకొంటే నది సముద్రంలో కలిసినట్లుగా మనం బ్రహ్మంలో ఐక్యమవుతాము. ఏకమతితోటి, ఏకబుద్ధితోటి పనిచెయ్యటం ఐకమత్యం, శరీరాలు రకరకాలుగా ఉండవచ్చు. కాని ఒకపని చేసేటప్పుడు పదిమంది ఏకమతితోటి, ఏకబుద్ధితోటి చేస్తే అది ఐకమత్యం అని చెప్పారు. ఇంట్లో పదిమందిఉంటే వారు ఐకమత్యంగా ఉంటే లక్ష్మి పెరుగుతుంది, శాంతి పెరుగుతుంది. మీరు శాంతిగా ఉండటమే కాదు ఇతరులు శాంతిగా ఉండటానికి సహకరిస్తారు. నది ప్రవహిస్తూ ఉంటుంది. 10 నిమిషాలు ఆగు, నావంకచూడు అంటే ఆగదు, చూడదు. సముద్రంలో కలిసేవరకూ దాని ప్రయాణమే ప్రయాణం, దాని వేగమే వేగం. నదీప్రవాహం ఎలాగ ఉంటుందో, భగవంతుడిని పొందటానికి మన చింతనకూడా అలాగ ఉంటే మనకు ఆత్మ జ్ఞానం కలుగుతుంది. మనకు అనన్య చింతన రాలేదు, ఇతర చింతనలు లేకపోతే పరమేశ్వరునిపై అనన్య చింతన ఉంటుంది. ఇతరచింతలు లేకుండా ఎవరైతే నిరంతరం సర్వకాల సర్వావస్థలలో నన్ను స్మరిస్తున్నారో, నన్ను పూజిస్తున్నారో, నాకోసమే జీవిస్తున్నారో వారి యోగక్షేమములు నేను చూడకపోతే ఎవరుచూస్తారు, వారి బాధ్యత నాదే అన్నాడు భగవంతుడు. మన మనస్సులో ఏమిఉందో మనకు తెలుస్తుంది. అది ఏవెలుగులో మనకు తెలుస్తుంది. లోపల పరమాత్మ ఉన్నాడు పరమాత్మ ప్రసాదించిన వెలుగులో మనమనస్సులో ఏమి ఉందో మనకు తెలుస్తోంది. మన మనస్సులో ఏగుణం ఉందో ఆగుణంతో పరమాత్మ కలవడు, ఆయన వెలుతురును పంపినీమనస్సులో ఫలానా గుణం ఉంది అని నీకు చూపిస్తాడు, వాడు ఈశ్వరుడు. నీలోపల ఏమిఉందో ఆయన చూపిస్తూఉంటాడు, ఎలా అభివృద్ధి పొందాలో నీకు ఉపదేశిస్తూ ఉంటాడు. ఆలోపలనుండి వచ్చే ఉపదేశం మనకు అర్థం కాకపోతే లోపల ఏవో సంఘటనలు క్రియేట్‌చేసి, ఆసంఘటనల ద్వారా మనకు పాఠాలు నేర్పి ఆయన ఏహృదయంలో అయితే ఉన్నాడో అక్కడకు గుంజుకోవటానికి చూస్తాడు, వాడు గురువు. గురువు జ్ఞానప్రదాత. లోకంలోని సంఘటనల ప్రభావం నీమనస్సు మీద పడనివ్వడు, అది గురువు యొక్క దయ.

జ్ఞాని మూడు అవస్థలకు ఆధారంగా ఉంటాడు, వాటికి అతీతంగా ఉంటాడు, ఇవి నిజంకాదు అని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. జాగ్రదవస్థ, సప్నావస్థ, షుషుప్తి ఇవి మూడూ నిజంకాదు తెరమీద బొమ్మలు కల్పించినట్లు బ్రహ్మంయందు ఇవికల్పించబడ్డాయి. తెరనిజం కాని బొమ్మలు నిజంకాదు అలాగే ఈకల్పించబడినవి నిజంకాదు, కాని ఈకల్పించబడిన వస్తువులకు ఏది ఆధారంగా ఉందో అది నిజం. నీవు దానితో తాదాప్యం పొందినప్పుడు ఇవి అన్నీ కల్పించబడ్డాయి అని నీకు తెలుస్తుంది. అందుచేత మనం ఏదిగా ఉన్నామో దానితో తాదాప్యంకలిగే వరకూ మనం కానిదానిని అవును అని ప్రతీజ్ఞన్మలోనూ అనుకొంటూనే ఉంటాము. ఒకటి గుర్తుపెట్టుకోండి వ్యక్తిగతమైన భావాలకు ఎప్పడూ ప్రాముఖ్యత ఇవ్వవద్దు. వ్యక్తి రాగద్వేషములతో ఉంటాడు. ఆమోహంలో పడ్డామా జ్ఞానమనే ఒడ్డుకు రాలేము, వాటి మధ్యలోనే తిరుగుతూ ఉంటాము. వ్యక్తిగతమైన భావాలను నీవు ఆధారంగా చేసుకోవద్దు

శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో. సాధన పేరుచెప్పి కొంతమంది స్వార్దం పెంచుకొంటూ ఉంటారు. వారికి ఆత్మజ్ఞానం కలగటం లేదు అంటే అక్కడ స్వార్థంకారణం. లోపలఉన్న బ్రహ్మంగురించి ఉపనిషత్ ఏమని చెప్పింది అంటే సత్యం, జ్ఞానం, అనంతం, ఆనందం అని చెప్పింది. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఉండేదేసత్యం. జ్ఞానం అంటే నీవు ఏదిగా ఉన్నావో దానితో తాదాప్యంపొందితే అది జ్ఞానం అంతేగాని ఇన్‌ఫర్‌మేషన్ జ్ఞానం కాదు. అసలు జ్ఞానసముపార్జనపట్ల మనకు కాంక్షలేదు. నోములు, వ్రతాలు, పూజలు ఇవి అన్నీ పెద్దలు ఎందుకు పెట్టారు అంటే జ్ఞానసముపార్జనకు మనబుద్దిని సిద్దంచేయటానికి ఇవిఅన్నీ ఏర్పాటుచేసారు. గురువు దగ్గరకు వెళ్లినప్పడు మనం నేర్చుకోవటానికి వెళ్లాలి అంతేగాని గౌరవాలకోసం వెళ్లకూడదు. జ్ఞానంకావాలంటే నీవు జ్ఞానిని ఆశ్రయించు అని భగవంతుడు చెప్పాడు. ఇంతకుముందు ముక్కామలలో ఎవరోవచ్చి కలిసినాన్నగారు మీ దయవలన మాకు ఈ ఉపకారం జరిగింది అని చెపుతున్నారు. నాకు ఆశ్చర్యం వేసింది నేను ఎవడిని చేయటానికి, లోపల ఈశ్వరుడు అలా అనిపింపచేసాడు. ఎందుకు చేసాడు అంటే నేను మీక్షేమాన్ని హృదయపూర్వకంగా కోరుకొంటున్నాను కాబట్టి ఈశ్వరుడే ఆపనిచేసి నీకు నాన్నగారిద్వారా ఆపనిజరిగింది అని చెపుతున్నాడు. ఈఉపకారాలు అన్నీ నాశవం చేస్తోందా? లేదు. చేసేది ఈశ్వరుడే. వారిక్షేమం కోరటంలో నాబుద్ధిలో దోషంలేదుకాబట్టి ఆయన ఉపకారం చేసిగౌరవం నాకు ఇచ్చాడు, అది ఈశ్వరుడి ప్రణాళిక. భావదారిద్య్రం పనికిరాదు. భావశుద్ధి లేకుండా ఆత్మజ్ఞానం కలిగే సమస్యేలేదు. భావశుద్ధి ఆత్మజ్ఞానానికి దారి చూపిస్తుంది. జపం చేయటానికి అయినా, ధ్యానం చేయటానికి అయినా మనస్సు ఉండాలి, ఎందుకు చేయటం అంటే మనస్సు పవిత్రం అవ్వటం కోసం. ఇప్పడు ఇక్కడ స్నానం చేయాలనే తలంపు ఎవరికి వచ్చింది? మనస్సుకు వచ్చింది. మనస్సు ఉంటేనే ఇది అంతా, మనస్సు లేకపోతే ఏదీలేదు. మనోనాశనం పొందినవాడు జననమరణములకు అతీతంగా ఉంటాడు, సంసారచక్రంలోనుండి విడుదల పొందుతాడు, శాశ్వతశాంతిని పొందుతాడు. మీరు నూటికి నూరు పాళ్ళు మంచిపనులు చేసినా విమర్శించేవారు చాలామంది ఉంటారు, దానికి కారణం అసూయ. మీరు చేసే మంచిపనులకు అందరూ సంతోషిస్తున్నారు అనుకొంటున్నారు కాని కొంతమందే సంతోషిస్తున్నారు అని ఈమధ్య నాదగ్గర ఎవరో చెపుతున్నారు. ఆకొంతమంది సంతోషించాలి అని కూడా నేను అనుకోవటం లేదు, అని చెప్పాను. ఈశ్వరుడి ప్రీత్యర్థం చేస్తున్నాను, ఆసంతోషించేవారు కూడా నాకు మోక్షం ఇవ్వరు, మోక్షంఇచ్చేవాడు అంతర్యామిగా ఉన్నాడు, వాడు ఈశ్వరుడు, ఆయన సంతోషిస్తే సరిపోతుంది. అందరూ





సంతోషించాలి అని మీరు ఏపనిచేయవద్దు. అందరూ గౌరవించాలి, అందరూ సంతోషించాలి అని అనుకోవటం చివరకు మానసిక అనారోగ్యానికి దారితీస్తుంది. నిన్ను నీవు ఉద్దరించుకోవటానికి పనులు చెయ్యి. ఎవరో వచ్చి ఉద్దరిస్తారు అని కనిపెట్టుకొని ఉండవద్దు. నీమీద ఇష్టంలేనివారు నీ ఆత్మవిశ్వాసాన్ని చెడగొట్టటానికి చూస్తారు, ఆమాటలు పట్టించుకోవద్దు. నీమనస్సుకు ధైర్యంనేర్పు. ధైర్యముతో, ఓర్పుతో నిన్ను నీవు ఉద్దరించుకోవటానికి ప్రయత్నంచెయ్యి.

సంకల్పానికి కూడా బలం ఉంది అది గుర్తుపెట్టుకోండి. భౌతికంగా మీరు ఎవరికైనా సహాయం చేయలేకపోవచ్చు. వారు అభివృద్ధిలోనికి రావాలి, వారికి జ్ఞానం కలగాలి, వారు బాగుపడాలి అని మనస్సులో అనుకొంటారు అనుకోండి, ఆసంకల్పం యొక్క ప్రభావం కూడా వారి మీద పనిచేస్తుంది. మనకు చేతనైతే ఎవరికైనా ఉపకారం చేయాలి, లేకపోతే ఊరక ఉండాలి అంతేగాని అపకారం మటుకు చేయకూడదు. మనం ఏదిచేస్తే రాబోయే జన్మలో అదే మనకు ఎదురువస్తుంది. భగవాన్ దగ్గరకు అనేకమంది వచ్చి జపం గురించి, ధ్యానం గురించి, యజ్ఞం గురించి చెప్పేవారు కాని సృష్టిలో ఏదీ కూడా నామనస్సును ఆకర్షించలేదు అని చెప్పారు. ఎందుచేత ఆకర్షణ కలుగలేదో చెప్పండి. ఆయన ఏదిగా ఉన్నాడో అది అయ్యి ఉన్నాడు, దాని తాలుక అనుభవం పొంది ఉన్నాడు కాబట్టి సృష్టిలో దేనిమీద ఆకర్షణ కలుగలేదు ఆయన సహజస్థితిని పొంది ఉన్నాడు. ఎప్పడైతే సహజస్థితి వచ్చిందో అప్పడు భగవంతుడు ఆశరీరాన్ని స్వాధీనంచేసుకొంటాడు, ఆశరీరం ద్వారా ఆయన పనిచేస్తాడు. భక్తులలో కూడా కొంతమంది తింగరతనంగా ఉంటారు. ఈమధ్య ఒకరు చెపుతున్నారు. వారి ఇంట్లో కృష్ణుడు మురళీతో ఉన్న విగ్రహం ఉంది అట. ఆవిగ్రహం తీసి వేయండి, ఆయన మురళీ ఊదినట్లుగా మీ ఇంట్లో ఉన్నది అంతా ఊదేస్తాడు, ఇంక మీకు ఏమీ మిగలదు, ఆవిగ్రహాన్ని వెంటనే తీసేయండి అని ఎవరో చెప్పారట. అది నెగిటివ్ తింకింగ్. కొంతమంది ఉంటారు వారికి ఎంతసేపు నెగిటివ్ తింకింగే, మీరు మంచిచెప్పినా దానిని చెడ్డ క్రింద తీసుకొంటారు. వారు సుఖపడరు, మనలను సుఖపడనివ్వరు. మురళి ఖాళీగా ఉంటుంది కదా మురళి ఏవిధంగా అయితే ఖాళీగా ఉందో అలాగ నీహృదయంఖాళీఅయితే మనలను మురళిక్రింద ఉపయోగించుకొంటాడు అంటే కృష్ణుడు చేతిలో మురళి అయిపోతాము, మనశరీరాన్ని ఆయన స్వాధీనం చేసుకొని ఆశరీరంద్వారా పనిచేస్తాడు అది అర్ధంకాక, దానిని తిరగేసి చెపుతున్నారు. బాహ్యశత్రువులు మనలను అభివృద్ధిలోనికి

రానివ్వరు. బాహ్యశత్రువులకంటే లోపలశత్రువులు ఇంకా ఎక్కువ ప్రమాదం, వారుకూడా మనలను అభివృద్ధిలోనికి రానివ్వరు. జపధ్యానములు చేస్తూ, సత్పురుషుల సహవాసం చేస్తూ ధైర్యంపెంచుకొని, బుద్ధిని సంస్కరించుకొని, ఆత్మవిశ్వాసం పెంచుకొని లోపలశత్రువులను బయటశత్రువులను జయించుకొంటూ వస్తేగాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మీరు ఎప్పుడైతే సాధనలో ఉన్నారో, మీ సాధనా బలం పెంచటానికి ఈశ్వరుడు కొన్ని సంఘటనలు క్రియేట్ చేస్తాడు. మీకు ఎంత ధైర్యం ఉందో చూస్తాడు, మీలో భయం ఉంటే తొలగిస్తాడు, వివేకం పెంచుతాడు, లోపలశత్రువులను, బయటశత్రువులను ఎదుర్కొనే శక్తిని ప్రసాదిస్తాడు, చివరకు మీకు ఆత్మజ్ఞానాన్ని ఇస్తాడు, వాడే ఈశ్వరుడు. నీమనస్సును శోధించకుండా, ఈమనస్సు ఎవరు అని దానిని విచారణ చేయకుండా, దానిని విశ్లేషణ చేయకుండా నీకు చిత్తశుద్ధి కలుగదు. శరీరం మరణించాక నీకూడా ప్రయాణించేది నీమనస్సే. అందువలన ఈ మనస్సు ఎవరో తెలుసుకొని దానిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యి. జ్ఞానం పొందటానికి అడ్డువచ్చేది కూడా మనస్సే. నీమనస్సును నాకు ఇచ్చేస్తే నాస్వరూపాన్ని నీకు ఇస్తాను అని భగవంతుడు చెప్పాడు. చిత్తాన్ని శోధించటం వలన నీకు ముక్తి కలుగుతుంది. రహస్యం అంతా మనస్సులోనే ఉంది. మనస్సును శత్రువుగా చేసుకోవద్దు, దానిని మిత్రుడుగా చేసుకో. మనస్సును మిత్రుడిగా చేసుకొంటే అది నీకు ఉపకారంచేస్తుంది. జపం చేయగా చేయగా అజపస్థితి వస్తుంది. మీరు కొంతకాలం ప్రయత్నం చేయగా చేయగా ప్రయత్నంలేని స్థితిని పొందుతారు. అప్పుడు మీప్రయత్నంతో సంబంధం లేకుండానే ప్రయాణం సాగిపోతుంది. మనంకొంత సాధన చేసాక హృదయంలో నుండి ఆకర్షణ వస్తుంది. అప్పుడు ఇంక నీ సాధనతో పనిలేదు, ఆప్రవాహంలో కొట్టుకొనిపోతావు, హృదయగుహలో పడిపోతావు. అయితే కళ్యాణగుణాలు పెంచుకోవాలి. లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి రావటానికి కళ్యాణగుణాలు సహకరిస్తాయి. లౌకిక ప్రేమలు నిజం అనుకోవద్దు, వాటికిలోతు ఉండదు. ఈశ్వరుడికంటే మనలను ప్రేమించేవారు ఎవరూ లేరు. త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు. ఈగౌరవాలు, దేహాభిమానం త్యాగం చేయకుండా మనకు జ్ఞానంరాదు. త్యాగం అంటే నీవు కానిదానిలో నుండి నీవు విడిపోతూ ఉండాలి. నీవు కానిదానిలో నుండి నీవు విడిపోతూ ఉంటేనే గాని నీవు ఏదైతే అవునో అందులో ఐక్యం అవ్వలేవు. నీవు కానిదానిని అవును అనుకొన్నంతకాలం నీవు ఏదైతే అవునో అది నీకు తెలియదు, నీకు అనుభవంలోనికి రాదు. పూజ, జపం, ధ్యానం వలన తమోగుణం తగ్గుతుంది. రజోగుణంతగ్గుతుంది. సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం వలన సహనం వస్తుంది. సహనం మనకు కీడు చెయ్యదు,

**20-08-2003**



మేలు చేస్తుంది, జ్ఞానం పొందటానికి మనకు సహకరిస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-08-2003, రాజమండ్రి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇప్పుడు మనం పుష్కర స్నానాలు చేస్తున్నాము. ఎందుకు చేస్తున్నాము? పుష్కరుడు మనలను పవిత్రం చేస్తాడు, దోషాలనుండి విడుదల పొందుతాము అనుకొంటున్నాము. అందువలననే స్నానం చేస్తున్నాము. ఇది మంచిదే, ఇది భౌతికమైన విషయం. మనం గోదావరిలో, గంగలో ఎలా స్నానం చేస్తున్నామో అలాగ మన హృదయంలో ఉన్న జ్ఞానగంగలో, ప్రేమగంగలో, ఆనందగంగలో స్నానం చెయ్యగలగాలి. మనలోపలఉన్న గంగలో స్నానం చెయ్యటానికే ఈగోదావరినదిలో స్నానం చేయటం. ఆనందం ఎక్కడఉంది? ఆనందం మన హృదయంలో ఉంది, బయట ఏవస్తువులోను ఆనందం లేదు. మనం కొంతమంది స్నేహితులను, ఇంట్లోవారిని ప్రేమిస్తూ ఉంటాము. ఆ ప్రేమించటం కూడా వారికోసం కాదు, వారిని ప్రేమించటం వలన మనకు ఒక సంతృప్తి కలుగుతుంది, ఆనందం కలుగుతుంది. సమాజంలో ఎవరైనా మనుషులను ప్రేమించినా, కుటుంబసభ్యులను ప్రేమించినా మన కోసమే వారిని ప్రేమిస్తున్నాము. మనం ఏదైనా ఒక మంచి పని చేసాము అనుకోండి, దాని వలన మనకు సంతృప్తి కలుగుతుంది. ఆ సంతృప్తి కలగటం కోసం మనం ఆపనిని చేస్తున్నాము. అక్కడ ఆపనికంటే, ఆపని చేయటం వలన వచ్చే ఆనందం మనకు ముఖ్యం. అంటే ఆ పనికూడా మన కోసమే చేస్తున్నాము, మన ఆనందం కోసమేచేస్తున్నాము. ఒక మహాత్ముడు ఏమిచెప్పాడు అంటే మీరు ఏపని చేసినా ఆడంబరంకోసం చేయవద్దు, గొప్పలకోసం చేయవద్దు, నిరాడంబరంగా, నిరహంకారంగా చెయ్యండి. అలా పనిచేస్తే పరలోకంలో మీకు భగవంతుడు స్వయంగా స్వాగతం చెపుతాడు. మీరు ఇక్కడ గొప్పలకోసం, ముచ్చట్లకోసం ఆడంబరంగా మంచి పనులు చేస్తే ఇక్కడ ముచ్చట్లు వస్తాయి, గౌరవాలు వస్తాయి కాని పరలోకంలో భగవంతుడు మటుకు మీకు స్వాగతం చెప్పడు అని చెప్పారు. అంటే ఇక్కడ మనంచేసే పనిముఖ్యంకాదు. మనం ఏ ఉద్దేశ్యంతో ఆపని చేస్తున్నామో భగవంతుడు చూస్తాడు. ఈశ్వరుడు అంతటా ఉన్నాడు, మనలో అంతర్యామిగా కూడా ఉన్నాడు. ఆయనే మనకు ప్రభువు, యజమాని. ఆయన ప్రీతికోసం మనం పనులు చేస్తే మనకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. అందుచేత మనం జీవితంలో మెలుకువగా ఉండవలసింది ఏమిటి అంటే ప్రియం, అప్రియం వీటిని తగ్గించుకోవాలి. ప్రియం ఉన్నచోట కోరిక ఉంటుంది.

**రమణ భాస్కర**